నివాళి

# గంగావతి

- యం. రామకోటి

''బాబయ్యగారూ! వీణ్ణెందుకండీ వెంటబెట్టు కొచ్చేరూ.. తోడా?''

''కాదమ్మా.. వేసవి సెలవులకి ఎక్కడికేనా తీసుకెళ్ళమని మారాం చేసేడు.. వాడి మంకుపట్టు సువ్వెరగంది కాదు''

''అయితే కాంగ్రెసు మీటింగులకా. వీణ్ణి దేశభక్తుణ్ణి చేసేస్తున్నారా? బాగుంది బాగుంది వరస''అంటూ నవ్వుతూ వినయంగా అదమాయించింది మేజరు గంగావతి.


ఆర్మీలో ఎన్నో చక్కర్లు కొట్టి వడగడితే గాని ఉత్తరాలందవు. అందగానే చూసుకుని 'నాన్నా, బాబయ్యగారూ వస్తున్నారు' అని సంబరపడిపోతూ బయల్దేరి అమృత్‌సర్ వచ్చింది.

''అయినా వీడెందుకండీ ఇక్కడ.. తలనెప్పి.. బోధపడాలా ఏడవాలా..?''

''నీతో బాటు తీసుకెళ్లే.. మేఁవేఁ ఎలాగో వస్తాంలే'' అన్నారు నాన్న.

''ఇంకేం.. పదరా తమ్ముా.. పద'' అంటూ రెక్కపట్టుకుని లాక్కుపోయి తన కార్లో కూర్చో బెట్టుకుంది గంగావతి.

కార్లో కూర్చుని మనసు చెంగుమని గెంతులేస్తుంటే పొంగిపోతున్నాడు రఘు.. రఘురాం.



డాక్టరు నారాయణమూర్తిగారి యిష్టసఖి కూతురు గంగావతి. రఘురాం తండ్రి రామచంద్రాచార్యులు గారు పేరూ, ప్రతిష్ఠా, పలుకుబడీ వున్న లాయరు. డాక్టరు గారూ, లాయరు గారూ స్వాతంత్ర్యోద్యమంలో లాఠీ దెబ్బలు రుచి చూసి అప్పుడప్పుడు జైళ్ళ పాలయిన వాళ్ళు. గాంధీ టోపీలు జరీ అంచు ఖద్దరు పంచెలూ పాట్నాలు కళ్ళ లాల్చీలూ.. వృత్తులు పక్కన బెట్టి వూళ్ళూ పూళ్ళూ తిరిగారు.

అమృత్‌సరొచ్చేరు.

మేజరు గారి కారు అటారే దాటింది. దార్లో చిన్న తోటలో వేడివేడి కచోడిలమ్ముతుంటే.. వాటితో బాటు టీలు తెమ్మని డ్రైవర్ని పంపించేరు. రఘు చేత తినిపించి టీ తాగి బయల్దేరేరు. లాహోరు చేరుకునేసరికి పొద్దుకూకుతోంది.

అదో పెద్ద కోట. ఏనుగు మీద గుర్రాన్నెక్కించి దానిమీద మనిషి మీద మనిషెక్కినా అందనంత కోట ద్వారం. దాదాపు మైలు దూరం వుంటుంది ఆర్మి కేంపు. క్వార్టర్సు చేరుకునేసరికి దీపాలు పెట్టేరు.

అదొక పెద్ద మహలు. చలవరాళ్ళమయం. షేండ్లియర్లూ.. గోడలకి గాజుదీపాల గుత్తులూ.. చూస్తూ నిశ్చేష్టుడైపోయేడు రఘురాం.

"ఏవిట్రా.. ఒంటిమీద తెలివి లేకుండా చూస్తన్నావూ?"

"గంగక్కా! ఏ మహారాజులదీ కోటా?"

"రాణా రంజిత్ సింగుది.. సిక్కు సామ్రాజ్య చక్రవర్తి"

హిస్టరీ పాఠాలు జ్ఞప్తికొచ్చేయి.

"దార్లో 'లవ్ హూర్' అని బోర్డులున్నాయేఁవిటి? లాహోరు గదా?"

"రాములవారి కొడుకు లవమహారాజు నిర్మించిన ఊరట.. అలాంటి బోర్డులు ఎక్కడ పడితే అక్కడ చాలా వున్నాయి" అని చెప్పింది.

యూనిఫారం తీసి కోటు స్టేండుకి తగిలించి, స్నానం చేసి చీర కట్టుకుని కుచ్చెళ్లు సవరించుకుంటోంది. రవిక తొడుక్కుని వచ్చిందేమో చీర మరుగున దాచినా దాగడం లేదు వుబికిన చనుకట్టు బిగువు. నిలువుటద్దం ముందు నించుని కుంకం బొట్టు దిద్దుకుంటోంది. సోఫామీద కూర్చుని రఘురాం అద్దంలో పదేపదే చూస్తూ మైకంలో పడిపోతున్నాడు. వాడి చూపులు వీపు మీద చురుక్కుమనిపించి వెనుదిరిగి చూసింది గంగావతి పైట సర్దుకుంటూ.

"ఏం ఉవ్విళ్ళూరుతూ తేపకారుస్తున్నావ్.. కొంటి వెధవా.. నీకన్న ఎంత పెద్దదాన్నో తెలుసా.. అక్కన్రా.. చాల్చాలు.. బాత్‌రూంలో వేణ్ణీళ్లు పట్టి ఉంచేను.. ముందు స్నానం చేసి బట్టలు మార్చుకో.. తాపఁవేనా చల్లారుతుంది"

సిగ్గుపడిపోయి బాత్‌రూంలోకి జారుకున్నాడు రఘురాం.

ఎన్నాళ్ళయినా మారలేదీ వెధవ..పువ్వు పుట్టగానే పరిమళం వెదజల్లుతుందంటారు. ఈ వెధవ గన్నేరు పువ్వు.. పుట్టుకతో వచ్చిన బుద్ధిది.. ఏం చెయ్యగలం అనుకుంది గంగ. అదే గంగావతి.

కేంపులో తెలుగు కుటుంబాలున్నాయి. వాళ్లకి కబురంపింది. "అమ్మా! వీడు కాయాకసురే తింటాడు. నీచు అలవాటు లేదు.. మూణ్ణాలుగు రోజులుంటాడీ తమ్ముడు.. భోజనం ఏర్పాటు చెయ్యగలరా.. మీకు చాలా థేంక్స్" అని పురమాయించింది మేజరుగా.

"ఎంత మాటన్నారు.. ఇదో భాగ్యవా?"

అక్కడ విరివిగా ఆవకూరే దొరుకుతుంది. కర్మపశాఖం అంటారు. అదే కూరా, పులుసూ, పచ్చళ్ళూ.. అన్నీదాన్నోనే!

తెల్లారేసరికి మేజరు గంగావతి కోటలోనే కేంపు ముందు జాగింగ్‌కి వెళ్ళి పోయింది. నడుస్తోంది కాని రఘురాం తుంటరి చూపుల్నే మరువలేకపోతోంది. వావీ వరుసా లేదు వీడికి. వయోభేదం కూడా లేదు.. ఏ నియమాలూ అడ్డు రావడం లేదు. ఎలా మార్చడం... మంచీ చెడూ ఎలా మప్పడేఁ కుర్రవెధవకని.. మథనపడుతోంది.

"మేడం.. ఏడున్నరయిపోయింది" అన్నాడు ఎడ్జుటెండు.

"ఆఁ..ఆఁ.. పద" అంటూ క్వార్టర్సుకి వెళ్ళింది.

వెళ్ళింది కాని.. ఆనాటి రోజులూ, వీడి వాలకం అన్నీ కళ్ళముందు తిరుగుతున్నాయి.

***

ధనుర్మాసం –సంక్రాంతి పండగ రోజుల్లో రఘు తల్లి రంగనాయకమ్మ గారు కళ్ళాపి జల్లి వీధి గుమ్మం ముందు ముగ్గులు పెడుతూ తిరుప్పావు చదువుతూ, యిరుగు పొరుగు పిల్లల్ని చేరదీసి అష్టపదులూ, తరంగాలూ నేర్పుతూ పాడించేది.

రోజా తాతగారింటి పనై పోగానే, ఆ పాటలు వింటూ ఆ ముగ్గులు వేపు చూస్తూ వుండిపోయేది తను.

దమ్మిడీ అంత కుంకంబొట్టూ కాటుక దిద్దిన చంపకి చారడేసి కళ్ళూ పాలకడలిలో పుట్టినట్టు ఆ తెలుపూ, నీలం బుట్టాల పరికిణీ, దానిమీద సంపెంగ రంగు ఓణీ.. జీవం తొణికిసలాడే పిల్లని చూసి 'ఎవరీ పిల్లా! అపరంజి బొమ్మా!' అనుకుంటూ

"చిక్కుతే పాలు గారేలా వున్నావు..మీ అమ్మ వెన్న మదాయించి పోత పోసిందా?.. ఎవరే పిల్లా నువ్వూ" అని పైకి అనేసింది.

"బోగాలఁవండి"

తెల్లబోయింది రంగనాయకమ్మ.

"రోజా ధన్యం రాజువారి వాకిలెందుకు కడుగుతున్నావూ?"

"మా తాతగారండి"

"ఆ! ఎక్కడుంటున్నావూ?"

"బోగాలవీధిలోనండి"

"పేరు"

"గంగావతండి.. అందరూ గంగంటారండి"

"ఎవరే మీ అమ్మ?"

"మాణిక్యం అండి"

"ఆఁ..ఆఁ.. మా మాణిక్యం కూతురువా..ఆఁ.. చెప్పేవు గావూ.. అమ్మడూ ముందే చెప్పొచ్చుగదే.. మీ అమ్మా నేనూ ఒకే బడిలో చదూకున్నాం.. మీ అమ్మ చందనం బొమ్మలా వుండేది"

"మీరేఁవంటారో అని భయపడ్డాను"

"నా దగ్గర భయఁవెందుకే అమ్మడూ.. మా డాక్టరు నారాయణమూర్తి కూతురివన్నమాట?"

"ఊఁ.."

"మీ అమ్మ చక్కదనంలో నూరోవంతు నీకొచ్చిందే.. తాత వాకిలి రోజూ కడిగి పుణ్యం చేసుకుంటున్నావే తల్లీ!"

"మా అమ్మ మిమ్మల్ని పిన్నమ్మగారూ అని పిలవమంది.. పిలవొచ్చాండి"

"మహారాజులా పిలు.. పిన్నమ్మగారూ కాదు పిన్నీ అను చాలు. ఇంకా దగ్గరవుతాం.. ఇంతోటి భాగ్యానికీ అడగడం కూడానా?"

అంటూ దగ్గరకి చేరదీసుకుని చిల్లులు బుగ్గలు నొక్కి ముద్దెట్టుకుంది రంగనాయకమ్మగారు.

ఎంతదృష్టం.. ఎంత పుణ్యం అనుకుంది తను ఆనాడు.

స్కూలు ఫైనలు చదువుతోంది తను. ఓ రోజు "అమ్మా గంగా.. ఈ కుర్రనాగమ్మ రోజా కడుపు నెప్పనో కాలు నెప్పనో ఏవో సాకులు చెబుతూ బడి ఎగకొడుతున్నాడు.. తల్లీ తల్లీ ఈ వెధవని ఈడ్చుకు వెళ్లి బళ్ళో దిగవిడిచి రద్దూ"

నవ్వుతూ రఘు వేపు చూసింది. కళ్ళు మిటకరిస్తూ



సూటిగా చూస్తున్నాడు.

"రారా తమ్మూ.. మనం బళ్ళోకి వెళ్ళొద్దు.. ఆడుకుందాం రా" అంటూ వాడి చెవిలో "జీళ్ళు కొనుక్కుందాంవా?" గుసగుసలాడింది తను.

చటుక్కున ఎగిరి గంతేసి తన చంకెక్కేసేడు.

వోణీ వెనక వయసు పొంగుతోంది. అదే చూస్తూ దార్లో మరుగున పాటమరిస్తున్న పొంగుల్ని చెయ్యి జొప్పి గబుక్కున పట్టుకుని పకపకా నవ్వేడు రఘు.. ఈ కుర్రవెధవ. పెడీమని వాడి చెయ్యిమీద చరిచి చెయ్యి లాగేసి కళ్ళెర్ర జేసింది.

"ఉండొరే అమ్మతో చెబుతాను"

"ఏం? నేనేం చేసేనూ!" అమాయకంగా చూస్తున్నాడు.

'అమాయకుడా..? కుర్ర చేష్టా? బయటపడిపోగానే నటిస్తున్నాడా..' సతమతమై పోతోంది. వీడి వయసెంత? చెయ్యాలని చేసేడా.. అలా ఎందుకనుకోవాలి.. వయసెంత కుర్రవెధవ అనుకుంటూ మొహంలో మొహం పెట్టి చూసింది తను.

బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు. నవ్వేసింది తను. కానీ పెట్టి జీళ్ళు కొని వాడి జేబంతా నింపింది. పాపయ్యగారి బళ్ళోకి దిగబెట్టింది. రోజూ ఇదో ఉద్యోగఁవైపోయింది తనకి.

ఓ రోజెందుకో వెళ్ళలేదు తను. పలకాబలపం

## అక్షర నివాళి



రామకోటి అంటే మంచి కథల చిరునామా. రామకోటి అంటే మనిషి పక్షాన నిలిచే మంచి రచయిత. రామకోటి అంటే పురాణేతిహాసాలను సాంగోపాంగంగా చదివి జీర్ణించుకున్న విజ్ఞాన ఖని. సమాజ అధ్యయనంతో పాటు సకల సంకటాలతో సతమతమవుతున్న మనుషుల్నీ, బడుగు జీవుల దరిద్ర జీవనాన్ని చదివి కదిలిపోయే మానవత్వమున్న మనిషి. అందుకే మనసు కలుక్కుమన్నప్పుడల్లా కథలు రాసానన్నారాయన. ఉత్తరాంధ్రలో 'కథలు రామకోటి లాగా రాసుకుంటూ పోవడం కాదు, 'రామకోటి గారి'లా రాయాలి' అనే నానుడి ఈయనను చూసే వచ్చింది. ఈయన 25 జూన్ 1931న తూర్పుగోదావరి జిల్లాలోని మట్టిపల్లిలో జన్మించారు. 1960లో కథా రచన ప్రారంభించారు. చాలా తక్కువ కథలు రాశారు. 'నవ్య' పాఠకులకోసం ప్రత్యేకంగా ఓ కథ రాశారు. ఆ కథను అచ్చులో చూసుకోకముందే మార్చి 5వతేదీ అర్ధరాత్రి మరణించారు. శ్రీశ్రీ, ఆరుద్ర, రా.వి.శాస్త్రి, రోణంకి అప్పలస్వామి వంటి మహామహుల సమకాలికుడైన రామకోటిగారు రాసిన చివరి కథ 'గంగావతి' ఈవారం నవ్య పాఠకులకోసం..

పట్టుకుని తనింటి కొచ్చేసేడు. ఆశ్చర్యబోయింది.

''ఇక్కడకెందుకొచ్చేవురా.. రాకూడదు.. వెధవా ఈ గాలి కూడా సోకకూడదు పదపద''

''ఏం.? ఎందుకు రావద్దంటున్నావూ?'' అన్నాడు వాడు.

''ఏం? వాడొస్తే నీకేఁవేఁ?'' అంది మాణిక్యం.

''నీకేం తెలీదే అమ్మా''

''రంగనాయకి కొడుకనా.. బొద్దుగా ముద్దొస్తున్నాడు.. నా బాబు నాబాబే'' అని తన తొడమీద కూర్చోబెట్టుకుని గుండెల కదుముకుని బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపిస్తోంది మాణిక్యం.

అమ్మెప్పుడూ తాంబూలం వేసుకునేది కాదు. అయినా ఆ పెదాలు కిళ్ళీలతో పండినట్టుంటాయి. పేరుకి తగ్గట్టు ఎర్రటి మాణిక్యాల్లా వుంటాయి. ఆ పెదాల వేపు అలా చూస్తూ గబాలన ముద్దు పెట్టుకున్నాడు రఘు. కంగారు పడిపోయిందమ్మ. కిందకి దించేసి ఏవిఁటే అని తన మొహంలోకి చూసింది.

''అందుకే వద్దన్నాను.. ఆ వెధవ పెద్ద పోకిళ్ళు నువ్వేరగవు'' అంటూ వాణ్ణి రెక్కబట్టుకుని ఈడ్చుకుని పోయింది తను. బావురుమని ఏడుస్తూ బొద్దు చేతులతో బుగ్గల మీద కారుతున్న చారికలు తుడుచుకుంటూ.. ''పో పో.. నన్ను ముట్టుకోకు'' అంటూ విడిపించుకున్నాడు. బుజ్జగించి జీళ్ళు కొని జేబునింపింది. అలకపోయింది. చంకెక్కేడు. వూరుకున్నాడా, తన బుగ్గలూ కళ్ళూ ముద్దెట్టుకున్నాడు.. ఏవఁనుకోవాలో బోధపడలేదు తనకి.

***

కేంపులో అద్దం ముందు తన్ను తాను చూసుకుంటూ.. ఆలోచిస్తోంది. ఎస్సెస్సెల్సీ పరీక్షలు రాసేడు. పదహారేళ్ళొచ్చేయి. ఏవీఁమారలేదు ఈ వెధవ.. ఎవరితో చెప్పినా ఏవైఁపోతాడో అని వెనుకాడుతోంది.

ఆరోజుల్లో కారణాంతరాల వల్ల నాన్న తనని మెడ్రాసు పంపించేసేరు.. కోరికలు తరుముకొస్తున్నాయి మరి. ఎదిగేడు కదా.. వయసూ.. తన పైట మాటు అందాల్ని అలా చూస్తున్న రఘుని చురచుర చూసింది తను. ఇంకా దొంగ చూపులూ పోకిరీ చూపులూ ఎక్కడికీ పోలేదు. రెండింతలయ్యేయనుకుంది.

''మేడం.. ఏడున్నరయింది'' మళ్ళీ జ్ఞాపకం చేసేడు ఎడ్డుటెండు.

తుళ్ళిపడింది. మళ్ళీ ఈ కాలం.. ఈ లోకం.. అనుకుంటూ ''ఆఁఆఁ.. లెటజ్‌గో టు హాస్పిటల్''

కేంపు క్వార్టర్సుకి వెళ్ళి సార్జంటుని పిలిచి ''సజ్జన్ సింగ్.. నా కార్లో వీడికి లాహోరు చూపించు'' అని పురమాయిస్తూ రఘు జేబులో సీవఁరాణీ వెండి రూపాయి పడేస్తూ ''ఒరే తమ్మూ.. ఏం కావాలన్నా కొనుక్కో'' అంది.

''అక్కా! నువెళ్ళగా నేను కోట గేటుదాకా వెళ్ళేను.. అబ్బ! అవేం ఘుమఘుమలు.. అవేఁమిటే?''

''అవా స్వచ్ఛమైన నెయ్యి వాసనరా.. పూడాలు తయారు చేస్తున్నారన్నమాట''

''పూడాలేవిఁటే?''

''మన సొజ్జప్పాల్లా.. మీ అమ్మ మనచేత ఎన్ని తినిపించేదో జ్ఞాపకం లేదూ?''

''ఓ.. అవేనా!''

''ఇదిగో సింగూ.. కానీ పెడితే మూడొస్తాయి. నువ్వూ సాయంపట్టు. అన్నీ తినేస్తే అజీర్తి పట్టుకుంటుంది చోక్రాకి.. ఇక్కడెవరూ బెగ్గర్సుండరు గదా.. అందుకే జాగర్త పడమంటున్నాను. వీణ్ణి క్షేమంగా మా బాబాయిగారికి అప్ప జెప్పాలి. ఎస్సెస్సెల్సీ పరీక్షలాసేవు వెధవా.. ఇక్కడ జీళ్ళు దొరకవు'' అంటూ నవ్వేసింది.

''ఏంటే అక్కా.. వీళ్ళందరికీ నా గురించంతా చెప్పేస్తావా?''

''అన్నీ చెప్పన్లే.. భయపడకు'' అంటూ పంపించింది.

ఏ అలవాట్లూ మారలేదు. చూపులు మరీ పదునెక్కేయి వెధవకి.

***

ఇరవై ఏళ్లయిపోయింది. కాలం గిర్రన తిరిగిపోయింది. మళ్ళీ వున్నవూరొచ్చింది.

''పిన్నీ! నిన్ను చూడాలనీ.. బాబయ్యగారినీ, రఘుగాడినీ చూడాలనిపించి వచ్చేను'' అంది గంగ.

పండుతున్న జుత్తూ, చెంపలూ, మెడమీద ముడి కళ్ళజోడూ, మగ్గిన ఛాయా చూస్తూ 'ఎవరా' అని పోల్చుకోలేకపోయేరు రంగనాయకమ్మగారు. పిన్నీ అన్న పలకరింపుతో ''నువ్వా గంగా! ఎన్నేళ్ళయిందే నిన్ను చూసి. ఆ లేవడి తనం నాజూకూ ఏఁవైపోయేయే తల్లీ.. బంగారబ్బొమ్మలా వుండేదానివి'' అంది రంగనాయకమ్మ గారు ఆశ్చర్యబోతూ.

''కాలం ఎవరికోసంవూ ఎప్పుడూ ఆగదు కదా.. మనకోసం ఆగుతుందా చెప్పూ.. నువ్వు మాత్రం వాడిలి పోలేదూ..''

''అవుననుకో.. అయినా ఈ పిన్ని ఇన్నాళ్ళకి గుర్తొచ్చిందా?''

''నువ్వు మాత్రం నన్నెప్పుడేనా తల్చుకున్నావా.. నేనొకర్తినున్నానని అనిపించలేదా పిన్నీ? మరిచిపోయేవా?''

''నిన్ను నేను మరిచిపోవఁడవేఁవిటే''

''మరిచి పోలేదా?.. రఘుకి పెళ్ళి చేసినప్పుడు నన్ను పిలవాలనిపించలేదా?''

గతుక్కుమంది రంగనాయకమ్మగారు.

''నువ్వెక్కడున్నావో.. ఏం చేస్తున్నావో జాబూ జాడా లేదు.. ఎలా కబురంపగలనే తల్లీ!''

''అవున్లే పిన్నీ దేశవిదేశాలన్నీ తిరిగేను బొంగరం లాగ.. ట్రాన్స్‌ఫర్లు. దేశం నాలుగు చెరగులా విపిరిపారేశారు.. ఎక్కడున్నానని చెప్పనూ?''

''అదే కదే నేనూ అంటున్నాను''

''పోనీ కోడల్నేనా చూపిస్తావా?.. రఘు ఏడీ?''

''అయ్యో నా మతిమండా.. నిన్ను చూస్తూ మాటల్లో బడి మరిచిపోయేను.. అమ్మా వల్లీ! ఓ మారు ఇలా రా తల్లీ'' అని కేకపెట్టింది.

''వల్లా! అదేం పేరు పిన్నీ!''

''అమృతవల్లి తాయారు..''

''అలాగే పిలు పిన్నీ.. ఎంత మంచిపేరూ?''

తళుక్ తళుక్ మని మెరుపుతీగలా లోపల్నుంచొచ్చింది. ఆ చిరునవ్వు నిండు పున్నమి పండు వెన్నెల కురుస్తోంది. చేతిలో కాఫీ కప్పు గంగ కందించింది.

''ఈ చక్కదనాల చుక్కని ఎక్కడ తెంపుకొచ్చేవు పిన్నీ!'' అని తన మెడలో రెండు పేటల జిగినీ గొలుసు అమృతవల్లి మెడలో వేసి బుగ్గలు ముద్దెట్టుకుంది.

''మీ ఆయనేడీ?'' అంది.

''ఇదిగో వస్తున్నాను గంగక్కా'' అంటూ భోంచేసి తువ్వాలుతో తుడుచుకుంటూ బయటకొచ్చేడు.

''ఏవండోయ్ తమ్ములుంగారూ!''

''అదేంటక్కా అలా అంటావు?''

''పెద్దవాడివయ్యావు గదరా మరదలు పిల్లేవఁనుకుంటోందోనని భయం''

ఆప్యాయంగా అమృతవల్లి వేపు తిరిగి చూసి ''చూడు మరదలా ప్రమిదలో దీపం గాలి వాటానికి అటూ ఇటూ ఒరిగిపోతుంది. పైగ చెంగు దడికట్టుకో.. కాపాడుకోవాలి సుమా.. అది నిల్చి మెలగాలి. అది నీ కంట్లోనే వెలగాలి.. ఎలా కాపాడుకుంటావో మరి''

నవ్వేసింది గంగ. సిగ్గుపడిపోయింది అమృతవల్లి. చాపమీద గంగ దగ్గరకి జరిగిపోయింది.

''అదేవిఁటే గంగా అలా అంటావూ.. వాడు రఘు రావుఁడే'' నిష్ఠూరంగా అంది రంగనాయకమ్మ.. నొచ్చుకుంది.

''అయ్యో పిన్నీ! వాడు రఘురామ రామచంద్రుడు. రఘుకుల తిలకం.. ఏదో మాటవరసకన్నాను.. అంతే.. వాణ్ణి నేనెరుగనా!.. వాడి కేవీఁ సాన పట్టిన మాణిక్యం. పులిగడిగిన ముత్యం.. యధాలాపంగా అన్నాను సుమా మరదలా.. అలగకూ''

చూసీ చూడనట్టు రఘువేపు ఓరకంట చూసింది.

అత్తా కోడళ్ళకి ఒక్కమాట బోధపడలేదు. అంతరార్థం అంతు చిక్కలేదు.

బెదురు చూపులు చూసేడు రఘు. మాట మారుస్తూ "అక్కా! ప్రమోషనుతో రిటైరయ్యావా?" అన్నాడు.

"ఏవుందిరా లాహోరునుండి బర్మాకి పొమ్మన్నారు. జపాను వాళ్ళకి దొరికి పోయేం. సుభాస్‌చంద్రబోసుగారి ఇండియన్ నేషనల్ ఆర్మీకి అప్పజెప్పేరు. తరవాత యింకేం వుంది.. రాజద్రోహనేరం.. విచారణా.. లాయరు బుల్లాభాయ్ దేశాయిగారి అలుపులేని వాద చాతుర్యం.. అదొక పోరాటవే.. చావుతప్పి కన్నులొట్టబోయింది.. ఉద్యోగంలో చేర్చుకుని బ్రిగేడియర్‌గా వెంటనే రిటైరు చేయించేరు.. ఇదిరా తమ్ముడూ నా ఉద్యోగపర్వం" అంటూ నవ్వేసింది.

"బియ్యే వాళ్ళకి షేక్స్‌పియర్ నాటకం చెప్పాలి.. మొదటి పీరియడే.. వస్తానూ వుంటావు గదూ" అంటూ రఘు జారుకుంటుండగా "ఉంటుందిలేరా.. అదెక్కడికెళ్తుందీ.. అమ్మా గంగా! లంకంత కొంప. బిక్కుబిక్కుమంటూ నలుగురే.. మేడమీద రెండు గదులూ వసారా.. మధ్యలో ఓ పెద్ద హాలూ.. ఓ గదిలో కొడుకూ కోడలూ వుంటారు.. అన్ని సదుపాయాలూ వున్నాయి.. నీ లాహోరు కేంపులో ఉన్నవన్నీ వున్నాయి. హాయిగా వుండు" అంటూ అర్థవంతంగా రంగనాయకమ్మగారి వేపు చూస్తూ మేడమీది గది శుభ్రం చెయ్యమన్నట్టు సైగ చేసేరు రామచంద్రాచార్యులుగారు.

"ఆగర్భ శ్రీమంతులు బాబయ్యగారూ! సదుపాయాలకే కొదవా? కొడుకూ కోడలతో వుండమంటారా? అంతమాటన్నారు.. అదే పదివేలు.. ఎంత పుణ్యం చేసుకున్నానో.. ఎందుకు లెండి బాబయ్యగారూ"

"అదే నేనూ అంటున్నాను.. వినడం లేదు మొండి ఘటం.. మరెక్కడుంటావే.. మీ సొంతింట్లోనా?"

"మళ్ళీ ఆ రొంపిలోకి వెళ్ళమంటావా పిన్నీ!"

"రొంపా!.. బురదా!.. అమ్మా! బురదంటే పంకం.. ఆ పంకంలోనే పుట్టింది పంకజం.. పద్మం. అది లక్ష్మీ నివాసం.. లక్ష్మికి ఆసనం. నువ్వే పద్మాక్షివి.. నీకేం వమ్మా కంట్లో ఇంకా లక్ష్మీకళ ఎక్కడికీ పోలేదు.. ఎక్కడికీ వెళ్ళొద్దు.. ఆ లక్ష్మీ కళ నా యింట కళకళలాడాలి.. ఏదోవంక పెట్టకు.. కొంత సేపులో తిరిగొచ్చేస్తాను.." అంటూ ఆ వయసులో కూడా జరీ తలపాగా సర్దుకుంటూ కోర్టుకి వెళిపోయారు రామచంద్రాచార్యులుగారు..

"మా బాబయ్యగారేనా.. నా బాబయ్యగారేనా.. అమృత్‌సర్‌లో చూసిన ఆ బాబయ్యగారేనా.. అమరం, ఆంధ్రం, ఆంగ్లం.. ఔపోసన పట్టిన మహనీయుడు.. ఉపమానాలకేం లోటూ.. ఆ బుద్ధి పదునేవీ తగ్గలేదు" అని కొంతసేపు మూగదై పోయింది.

ఏకాంతంగా ఉన్నారు.

"గంగా!"

"పిన్నీ!" అంటూ తెప్పరిల్లింది.

"ఏవిటే!.. ఆ వెర్రిచూపూ.. బాబయ్యగారు వచ్చేస్తార్లే.. ఎక్కడికీ వుడాయించకు"

"పిన్నీ!"

"ఏవిటే!"

"మా తాతగారి పొరుగున..రాజుండేవాడు"

"అవునూ నీలాద్రి నాయుడు కొడుకేనా?"

"ఊఁ.. ఎలా వున్నాడు పిన్నీ.. ఏం చేస్తున్నాడు?"

"ఏం.. ఎందుకడుగుతున్నావూ?"

"అబ్బే! ఏం లేదూ.."

"వాడెందుకొచ్చేడు నీ తలంపులోకి?" నర్మగర్భంగా ఆరా తీసింది రంగనాయకమ్మగారు.

"ఊరికే" అంటూ కళ్ళు దించేసుకుంది గంగ.

'అమ్మ గడుగ్గాయీ.. అయితే ఆనాడు కుర్రకుంక రఘుగాడు చెప్పింది నిజంవేనన్నమాట.. అమ్మా! అమ్మా!.. మరేమో మరేమో.. రాజుగాడు రోజూ అరుగుమీద పందుంపుల్ల పట్టుకుని గంగవేపు చూసి నవ్వుతున్నాడు.. గంగక్కకూడా ముగ్గులేస్తూ ఓరగా చూస్తూ నవ్వుతోంది.. కథ చెప్పేడు అనుకున్నానప్పుడు.. ఈ కుర్రవెధవెలా పసిగట్టేడూ'అనుకుంటూ.. తనలో తనే ఆలోచిస్తూ గంగవేపు చూసి

"ఊఁ?" అన్నట్టు కళ్ళలో కళ్ళు పెట్టి ఏవిటి సంగతి అన్నట్టు ఆ చూపులో అంతర్భావం రాబడుతోంది రంగనాయకమ్మగారు.

"ఊఁ" ముక్తసరిగా మరో పలుకు లేక తల ఊపి.. రసోచితంగా చిరునవ్వు నవ్వింది. అవి మూగ భాషలు. మాటల్లేవు.. నర్మగర్భ సంభాషణలు.

"నాయుడుగారెలా ఉన్నారూ?" అంది గంగ.

"గుండాగిపోయేడు.. భార్య బెంగపెట్టుకుని మంచంపట్టి ఆవిడా హరీమంది"

"ఏం?"


"రాజుగాడు ఓ కిరస్తానీ పిల్లని పెళ్ళాడి ఇంటికి తీసుకొచ్చేడు"

"కిరస్తానా.. ఎవరూ?"

## మనమీదేనర్రోయ్!

సరసి





"క్రిస్టీనా" అంటూ లోపల్నుంచే చెప్పింది అమృతవల్లి.

"ఆఁ.. క్రిస్టీనానా!" ఆశ్చర్యపోయింది గంగ.

అవి తను స్కూలు ఫైనలు చదువుతున్న రోజులు.

"ఛీఛీ.. భోగం పిల్లను చేసుకుంటావా? బుద్ధి లేదురా.. మన కుటుంబం దిగజారిపోయిందనుకున్నావా.. తరతరాల పరువురా మనిది.. చదువుకోరా అంటే దిక్కుమాలిన సావాసాలు చేస్తావా" అని కోపంపట్టలేక పంచలో కర్ర తీసి చితకబాదేడట. అంతటితో ఊరుకోకుండా నాన్న ఆసుపత్రిలోకి ఈదురుగాలిలా దూసుకు వెళ్ళి "ఏవయ్యా డాక్టరూ!.. ఇదా నీ నిర్వాకం.. నువ్వుంచుకున్నదాని కూతుర్ని తారుస్తున్నావా.. సిగ్గు లేదూ.. గాంధీగారి శిష్యుణ్ణంటావా.. పైకి నీతి కబుర్లా! నీతిమాలినోడా.. చెప్పేవి శ్రీరంగనీతులూ దూరేవి దొమ్మరి గుడిసెలూ"అంటూ అందరి ముందూ తిట్టరాని తిట్లు గుప్పించి నాన్న పరువు తీసేట్ట. మా అమ్మతో చెప్పుకుని ఏడ్చుకున్నారట.. ఇంక దాన్ని ఇక్కడుంచొద్దు.. అని ఆనాడే తనని మెద్రాసు పంపించేసేరు..

"ఎఫే.మెడిసినూ పూర్తి చేసుకుని వచ్చేస్తాను. ఆసుపత్రి చూసుకుంటాను" అంది తను.

"అన్ని ఏర్పాట్లూ చేసేను. లండన్లోనే ఎమ్మెస్సూ, ఎఫార్సీయస్సూ చెయ్యి. ఇక్కడికి రాకు.." అన్నారు.

చదువంతా అయిపోయింది.. అంతలో ఆర్మీలో రిక్రూటయ్యేను.. అగ్నిపర్వతాలు గుండెల్లో పేలిపోతున్నాయి.

విలవిలలాడిపోతోంది.. లోలోపలే కుమిలిపోతోంది.

"ఏవిఁటే పరధ్యాన్నం" అంది రంగనాయకమ్మగారు.

"ఏం లేదు పిన్నీ!.. ఏవేవో తలపులు ముసురుకుంటున్నాయి"

"రాజుకి కబురంపనా?"

"ఒద్దు ఒద్దు పిన్నీ!"

"ఏఁవమ్మా?"

"క్రిస్టీనా నా క్లేసుమేటు.. అక్కచెల్లెళ్ళా పెరిగేం.. వద్దు సుమా.. పాత కథలు పుట్టలో పావుఁలు.. అవన్నీ గుండెల్లోనే వుండిపోవాలి. అవి బయటకి రాకూడదు. వస్తే బుసలు కొడతాయి.. పగద్వేషం చెలరేగితే కాటు కూడా వేస్తాయి.. వద్దు పిన్నీ.. దాని సంసారం చల్లగా వుండాలి.. రాజు నన్ను చూస్తే.. వాడి గుండెల్లో తుపాను రేగుతుంది. క్రిస్టీనా కాపురం సుడిగుండఁవై పోతుంది..వద్దు పిన్నీ వద్దు" కళ్ళనీళ్ళొత్తుకుంటోంది గంగ.

"ఇంతకాలం .. ఇన్నాళ్ళూ.. ఈ అగ్గిని నీ కొంగునెలా ముడేసుకున్నావే తల్లీ!"

ఆడగుండె అగాధం.. ఆ లోతులు కొలవడం అసాధ్యం.

"చెల్లెళ్ళందరికీ పెళ్ళిల్లు చేసేవు. చదువులు చెప్పించేవు.. సాంబంకి చదువు చెప్పించి ఉద్యోగంలో పెట్టేవు.. మీవాళ్ళ పిల్లనే ముడిపెట్టేవు.. అందరికీ వెలుగులు పంచేవు. కొవ్వొత్తిలా కరిగిపోయేవు.. పెళ్ళీ పేరంటం లేకుండా మోడై పోయేవు"

"సానిపాపకి పెళ్ళా! మతి పోయిందా పిన్నీ!.. అభిమానానికేనా హద్దూ ఆపూ వుండాలి"

"చెల్లెళ్ళకి పెళ్ళి చేసేవుకదే"

"చేసేను. వాళ్ళల్లో చిచ్చు రేగింది.. అత్తమామలు వాళ్ళని ఇళ్ళల్లోంచి తగిలేసేరు. వేరు కాపరాలు.."

"పోనీచూసొచ్చేవా" అంది రంగనాయకమ్మగారు.

"వాళ్ళ సంసారాల్లోకి వెళ్ళకూడదు పిన్నీ.. అయినా నే నెందుకు తిరిగొచ్చేనా, బతికున్నానా.. అనుకుంటున్నారు.. ఆస్థికోసం వెంపర్లాడుతున్నాను అనుకుంటున్నారు. వాళ్ళ మానాన వాళ్ళని బతకనియ్యి పిన్నీ!"

"హోరి విశ్వాస ఘాతుకుల్లారా.. ఇంతకింతా అనుభవిస్తారు"

"పిన్నీ పిన్నీ!" అంటూ నోరు నొక్కేస్తూ "మహా ఇల్లాలివి.. శపించకు పిన్నీ! ఉత్తమ ఇల్లాలివి.. వాళ్ళని దీవించు తల్లీ.. శపించకమ్మా"

"ఎవరమ్మా నువ్వు.. అందరి బాగూ కోరే ఆకాశ గంగవా.. మంచుకొండ కూతురివా? శివుడి నెత్తిమీద వురకలేసే గంగమ్మతల్లివా.. తల్లీ నా కడుపునెందుకు పుట్టలేదే.. నా కన్నపేగు ధన్యఁవై పోను" అంటూ కన్నీళ్ళొత్తుకుంటూ గంగని గుండెలకత్తుకుంటూ.. తల నిమురుతూ ముద్దుల వర్షం కురిపిస్తోంది రంగనాయకమ్మగారు.

భోళ్ళని ఏడ్చేసింది గంగ.. ఆ ఒడిలో సేద తీరుతోంది.

"ఈ జన్మకీ ఆనందం చాలు.. నాగుండె నీ అమృతపు జల్లుతో.. అమృతవల్లి చూపులో అమృతవర్షిణితో తడిసి ముద్దైపోయింది... ఈ జన్మకిది చాలు" అంది గంగ.

రంగనాయకమ్మ కళ్ళు గంగ గర్భాలయిపోతున్నాయి. ఆ వెల్లువని తన దోసిళ్ళతో పడుతూ "పిన్నీ! నీకన్నీళ్ళు నేలమీద పడితే భూవిఁ భగ్గుమనిపోతుంది" అంటూ తన పైటలోకి జారవిడిచి యింకిపోయేలా జాగర్త పడింది.

"అమ్మా! ఎవరివే నువ్వు! చెప్పవే చెప్పవే.. నా గంగవేనా!.. అన్ని పాపాలు కడిగేసే సకల కల్మష హారిణిలా! గంగాభవానివా! ఎవరమ్మా నువ్వు.. ఎవరివే?"

"నీ గంగనే పిన్నీ.. అంతే అంతే.." అంటూ చివాల్న లేచి సంచీ సూట్కేసూ పట్టుకుని చెప్పులేసుకుని బయల్దేరింది.

"అదేవిఁటే.. ఎక్కడికీ?"

"ఈ జన్మకీ అదృష్టం చాలు.. మీకుటుంబంతో సంబంధం.. చేరిక.. అనుబంధం ఏ జన్మలోనో నే చేసుకున్న పుణ్యం.. ఈ ఆప్యాయతా అనురాగం, ఇంత మానవత.. ఇంక మోయలేను పిన్నీ"

రంగనాయకమ్మగారి కాళ్ళకి నమస్కరించింది. మరొక్కమారు మనసారా తనివి తీరా ఆవిణ్ణి కౌగిలించుకుంది.

"మీ బాబయ్యగారడిగితే ఏం చెప్పనే"

"సంసారుల కొంపలో జెర్రిగొడ్డు జొరబడకూడదని చెప్పేనని చెప్పు.. నేనిక్కడుంటే అక్కా! అక్కా అని వెంటబడతాడు రఘు. అమృతవల్లి హాయిగా పిల్లాపాపలతో కాపురం చేసుకోవాలి.. వాడి బతుకులో అమృతం కురవాలి.."

"ఏవిఁటే నీ మెట్ట వేదాంతం!"

"నే చూసిన నిజం"

ఏవీఁ అర్థం కాలేదు రంగనాయకమ్మగారికి.

మరి కనబడలేదు గంగ.. ఆకాశగంగ.

స్వర్గానికి.. పుట్టింటికి వెళ్ళిపోయిందా..? లోకాన్నీ అందరినీ ఉద్ధరించాలనీ.. ఉత్తమ లోకాలకి పంపాలని

పాతాళం చీకటి గుహల్లోకి వెళ్ళిపోయిందా!

వాపోతోంది రంగనాయకమ్మ.

బాధపడిపోతున్నారు లాయరుగారు..

గంగ మనసు పసిగట్టలేకపోతున్నారు.

ఇదంతా అమృతవల్లికి అగమ్య గోచరంగా వుంది.

రఘు.. రఘురామచంద్రుడొక్కడే..

రఘుకుల తిలకుడొక్కడే పోల్చుకున్నాడు.

మారు మాటలు లేక

పిచ్చి చూపులు చూస్తున్నాడు.

*



## మీరే డిటెక్టివ్!?

*నిర్వహణ: అన్య*

### వెండి విగ్రహాలు

చేతిలో తళతళా మెరుస్తున్న వెండి విగ్రహాలతో అందర్నీ ఆకట్టుకున్నాడా వ్యక్తి.

"కష్టపడక్కర్లేదు. ఒకడి ముందర చేతులు కట్టుకు నిలబడక్కర్లేదు. రోజూ మీ దురదృష్టాన్ని తిట్టుకుంటూ కూర్చోనక్కర్లేదు. వెదుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవద్దు. నాకో లక్ష ఇవ్వండి. మీకు పది లక్షలిస్తాను".

"ఏమైంది! గుప్తనిధులు దొరికాయా? మలక్ పేటలో గెలుపుగుర్రం ఆచూకీ తెలిసిందా? ఎవరింటికైనా కన్నమేద్దామా?"

"అదేమీ లేదు. ఇదిగో, ఈ వెండివిగ్రహాన్ని చూడండి. ముప్ఫైఏళ్ళక్రితం గోదావర్లో ఒక పడవ మునిగింది. అందులోని ప్రయాణికుల వద్ద వున్న వెండి సామాను ఒక లంకలో నిక్షిప్తమైంది. మొదట మనం ఆ స్థలం కొనుక్కుంటే తరువాత మనం దాన్ని తవ్వి తీసుకోవచ్చు. రెండు టన్నుల వెండి విగ్రహాలున్నాయి. ఇది రహస్యం. మరో మనిషికి పొక్కనివ్వద్దు".

"ఏ లంక? ఆ స్థలం ఎవరి ఆధీనంలో వుంది? ప్రస్తుత యజమాని దాన్ని అమ్మటానికి అంగీకరిస్తాడా? నువ్వు మమ్మల్ని మోసం చెయ్యటం లేదని నమ్మకమేమిటి?"

"మీ యిష్టం. రహస్యాలన్నీ చెబితే నాకేం మిగులుతుంది? ఇదిగో, విగ్రహం మరోసారి చూడండి. యజమానికి తెలియకుండా ఆ భూమిలో తవ్వి తెచ్చాను. ఇంకా యిసుక కూడా వదలలేదు".

"అవును. అందరికళ్లల్లో ఇసుక చల్లుతున్నావు" అన్నాడు డిటెక్టివ్.

ఏ ఆధారంతో డిటెక్టివ్ అలా మాట్లాడాడు?

**సమాధానం:** ముప్ఫై ఏళ్ల క్రితం ఇసుకలో కూరుకుపోయిన వెండి విగ్రహం తళతళా మెరుస్తుందా? అది, అప్పుడే పాలిష్ చేసి తెచ్చినదై వుంటుంది.